సాక్షి
నంద్యాల

సోమవారం ; 6 ; నవంబర్ ; 2023



అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



హోరాహోరీగా పోటీలు

స్కూల్‌గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో నందవరం జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో 16 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. 8లో▸



ఆలయాల అభివృద్ధిపై దృష్టి

ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప తెలిపారు. మహానందిలో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. 8లో▸

న్యూస్‌రీల్

నేడు జగనన్నకు చెబుదాం - స్పందన

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం-స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే ఈ కార్యక్రమానికి ఉదయం 9.30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రోటరీ సేవలు అభినందనీయం



జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల(వ్యవసాయం): ప్రపంచ స్థాయిలో రోటరీ సేవలు అభినందనీయమని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో రోటరీ ఫౌండేషన్ 3160 జిల్లా, రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ పోచా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రోటరీ సంస్థ పోలియో నిర్మూలన, విద్య, వైద్య, ఆర్థిక, వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాల్లో ప్రజలకు అండగా ఉంటూ సేవలందిస్తోందన్నారు. రోటరీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ మాజీ చైర్మన్ మహేష్ కొట్టేబాబు, రోటరీ పది జిల్లాల పోలియో చైర్మన్ డాక్టర్ గిరీష్ గునే, జిల్లాల చైర్మన్ డాక్టర్ మోహన్‌ప్రసాద్ రోటరీ సేవలను వివరించారు. కార్యక్రమంలో కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలకు చెందిన 500 మంది రోటరీ సభ్యులతో పాటు జిల్లాకు కాబోయే గవర్నర్ రాంప్రసాద్, మాజీ గవర్నర్‌లు రామలింగారెడ్డి, చిన్నపురెడ్డి, కల్లూరి రామలింగారెడ్డి, కందుకూరి శ్రీరామ్మూర్తి, విజయశేఖర్‌రెడ్డి, దండె దస్తగిరి, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే టీంకు సహకరించాలి

నంద్యాల(అర్బన్): గ్రామ కంఠంలోని ప్రభుత్వ ఆస్తులు, వ్యక్తిగత ఇళ్లు, ఖాళీ స్థలాల కొలతల నిమిత్తం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వామిత్వ సర్వే నిర్వహిస్తున్నట్లు డీపీఓ మంజుల వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే సమయంలో యజమానులు అందుబాటులో ఉంచి వారి ఆస్తి ధ్రువీకరణ పత్రాల నకళ్లను అందజేసి సర్వే టీంకు సహకరించాలన్నారు.

99.14 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో నవంబర్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ ఆదివారం సాయంత్రం 7గంటల సమయానికి 99.14శాతం పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 60 ఏళ్లు పైబడిన పింఛన్ లబ్ధిదారులు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

8 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ఎనిమిది మండలాల్లో వర్షం కురిసింది. కల్లూరులో 120.4, కర్నూలు అర్బన్‌లో 98.4, కర్నూలు రూరల్‌లో 57.8, కృష్ణగిరిలో 25.2, తుగ్గలిలో 17.0, చిప్పగిరిలో 12.6, మద్దికెరలో 11.0, ఓర్వకల్లులో 6.0 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది.

ప్రజల కష్టాలు తొలగేలా..

- జల్‌జీవన్ మిషన్‌తో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- జిల్లాలో 2,22,701 గృహాలకు కుళాయి కనెక్షన్లు మంజూరు
- రూ.297.47 కోట్లతో శరవేగంగా పనులు



ముక్కమల్లలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న వాటర్ సంపు, పంపు హౌస్

➤ సంజామల మండల పరిధిలోని ముక్కమల్ల గ్రామంలో నీటి సమస్య ఏటా తీవ్రంగా ఉంటుంది. టీడీపీ ప్రభుత్వ పాలనలో సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం శాశ్వత పరిష్కారం కోసం జలజీవన్ పథకం కింద ఇంటింటికీ శుద్ధ జలం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 90 వేల లీటర్ల సామర్థ్యంతో ఓహెచ్‌ఆర్ నిర్మాణానికి రూ.63.39 లక్షలు, 40 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ సంపు, పంపు హౌస్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు చివరి దశకు చేరుకుని త్వరలో నీటి సమస్య పరిష్కారం కానుంది.

➤ కొలిమిగుండ్ల మండలం బి.ఉప్పలూరు గ్రామ పంచాయతీలో నాగిశెట్టిపల్లె, బి.తాడిపత్రి గ్రామాలు ఏర్పడినప్పటి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు లేవు. చేతి పంపులు, డైరెక్ట్ పంపింగ్‌తో నీటి సరఫరా అందించేవాళ్లు. మధ్యలో ఏవైనా ఆటంకాలు వస్తే నీటి సమస్య ఎదురవుతూ ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కోటి రూపాయలతో మూడు గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఇంటింటికి కుళాయి కనెక్షన్‌లు ఇచ్చేందుకు రెండో విడతలో రూ.50 లక్షల మేర నిధులు వచ్చాయి.



ఇంటింటికి కుళాయి కనెక్షన్లు ఇస్తున్న దృశ్యం



బి.తాడిపత్రిలో పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంక్

జిల్లాలో జలజీవన్ మిషన్ పనులు, నిధుల వివరాలు

క్లస్టర్లు	మొదటి దశ		రెండో దశ	
	పనుల సంఖ్య	నిధులు (రూ. కోట్లలో)	పనుల సంఖ్య	నిధులు (రూ. కోట్లలో)
నందికొట్కూరు	90	24.99	93	16. 89
శ్రీశైలం	68	37.18	61	15.31
పాణ్యం	28	12.48	33	8.82
నంద్యాల	26	12.02	19	3.49
డోన్	131	14.98	173	28.87
బనగానపల్లె	79	29.99	130	31.05
ఆళ్లగడ్డ	132	45.80	26	15.55
మొత్తం	554	177.47	535	120

నందికొట్కూరు/కొలిమిగుండ్ల: అభివృద్ధికి పెద్దపీట వేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఓ వైపు రహదారులను అభివృద్ధి చేస్తూ మరో వైపు మంచి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తోంది. ప్రతి ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలో పలు పల్లెల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జలజీవన్ మిషన్ కింద గ్రామాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నారు. 2020-21 సంవత్సరానికి సంబంధించి నంద్యాల జిల్లా వ్యాప్తంగా రూ.120 కోట్లతో 565 పనులకు గాను 278 పనులకు అగ్రిమెంట్ పూర్తయ్యాయి. ఇప్పటికే జిల్లాలో ఆయా గ్రామాల్లో 185 పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వం కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తుంది. మిగిలిన 72 పనులు జోరుగా సాగుతున్నాయి. 21 పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. జల్‌జీవన్ మిషన్ కింద జిల్లాలో 2,22,701 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు మంజూరు చేయగా.. ఇప్పటికే జిల్లాలో 1,22,699 పేదల గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇచ్చేశారు. మిగిలిన 1.02 లక్షల కనెక్షన్లు త్వరితగతిన పూర్తి చేసేందుకు పనులను ముమ్మరం చేశారు. అందులో 21 పనులు ప్రారంభ కావాల్సి ఉండగా 9 వర్కులు డబల్ శాంక్షన్ అయిన ట్లు అధికారులు చెబుతున్నారు. 2021-22 సంవత్సరానికి సంబంధించి 554 పనులకు రూ.177.47 కోట్లు జల్‌జీవన్ మిషన కింద రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. 17 పనులకు టెండర్లు పూర్తి కాగా 173 పనులకు టెండర్లు ఆహ్వానించారు. 364 పనులకు టెండర్లు పిలవాల్సి ఉంది.

దశాబ్దాల సమస్యకు చెక్

ఏటా వేసవి వస్తే చాలు ముందుగా మంచినీటి సమస్య తీవ్రమవుతోంది. ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయించాల్సి వచ్చేది. నీటి కోసం గ్రామీణప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఈ క్రమంలో అపరిశుభ్రత నీటిని తాగి రోగాల బారిన పడి ఆసుపత్రుల పాలయ్యేవారు. కొన్నేళ్లుగా ఇదే సమస్య నెలకొన్నా గత పాలకులు ప్రజల కష్టాలను గాలికొదిలేసేవారు. ప్రస్తుతం జలజీవన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తుండటంతో ప్రజలు హర్షిస్తున్నారు. జిల్లా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. నిధులతో బయటి ప్రాంతాల్లో కొత్తగా బోర్లు, పైపులైన్ వేసి ఇంటింటికీ కుళాయిల సౌకర్యం కల్పించారు. దీంతో ఏన్నో ఏళ్లనాటి తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని ప్రజలు చెబుతున్నారు.

శరవేగంగా పనులు..

జల్‌జీవన్ మిషన్ పథకం కింద నంద్యాల జిల్లాకు మంజూరైన పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తగి న చర్యలు తీసుకున్నాం. పనుల్లో నాణ్యమైన పైపులను వినియోగిస్తున్నాం.

– సీహెచ్ మనోహర్, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి

నీటి కష్టాలు తీరాయి



మా గ్రామం కృష్ణానది తీర ప్రాంతం అయినా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. పనులు మానుకుని నీళ్ల కోసం వేచి ఉన్న రోజులు ఉన్నాయి. కుళాయిల వద్ద గంటల తరబడి నిలవాల్సి వచ్చేది. ఎండా కాలం నీళ్లు చూసుకుని వాడోవాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ వచ్చింది. తాగునీరు సంవృద్ధిగా రావడంతో కుటుంబ అవసరాలకు ఇబ్బందులు లేకుండా వాడుకుంటున్నాం. ప్రజల తాగునీటి కష్టాలు తీర్చిన జగనన్నకు రుణపడి ఉంటాం. – రాములమ్మ, అల్లూరు

ట్యాంకులు కడుతున్నారు



మా ఊరు అన్ని గ్రామాల కంటే ప్రత్యేకమైంది. 600 అడుగుల ఎత్తులో కొండపై ఉంటున్నాం. ఎక్కడా బోరు సౌకర్యం లేదు. కొండ దిగువన బోరు వేసి మధ్యలో గాజాలు నిర్మించి పైకి నీటి సరఫరా చేస్తున్నారు. మోటర్ కాలిపోయినప్పుడు, ఇతర సమస్యలు వస్తే మాకష్టాలు వర్ణనాతీతం. కొండ దిగువన ఉన్న చేదుడు బావిలో నుంచి నీళ్లు తోడుకొని ఎత్తుకొని వస్తాం. ప్రస్తుతం మాఊర్లోనే ఓవర్‌హెడ్ కడుతున్నారు,పనులు పూర్తి కావచ్చాయి. కొద్ది రోజుల్లో మా సమస్యకు పరిష్కారం కాబోతుండటంతో సంతోషంగా ఉంది. – సావిత్రి, కొండమీదపల్లె

మూడు ఊర్లలో ట్యాంక్‌లు



మా పంచాయతీలో మూడు ఊర్లు ఉన్నాయి. మొదటి నుంచి ట్యాంక్‌లు ఉండేవి కావు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సహకారంతో కోటి రూపాయలతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇంటింటికి కుళాయిలు ఇచ్చేందుకు బోర్లు వేస్తున్నాం. త్వరలోనే పనులు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గ్రామాల ప్రజలకు మంచినీటికి ఎలాంటి ఢోకా ఉండదు. – ఈశ్వరయ్య, సర్పంచ్, బి. ఉప్పలూరు గ్రామ పంచాయతీ

తొలి అడుగుకు ఆరేళ్లు



- ప్రజా సంకల్ప యాత్రకు నేటితో ఆరు వసంతాలు పూర్తి
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 18 రోజుల పాటు సాగిన యాత్ర
- నేడు కర్నూలులో ప్రత్యేక కార్యక్రమం

కర్నూలు(రాజ్‌విహార్): పేదల కష్టాలు తెలుసుకునేందుకు వేసిన తొలి అడుగుకు ఆరేళ్లు పూర్తయ్యాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో ప్రజా సంకల్ప యాత్ర (పాదయాత్ర)కు శ్రీకారం చుట్టి నేటి (సోమవారం)తో ఆరు వసంతాలయ్యాయి. 2017 నవంబరు 6వ తేదీన వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయ నుంచి పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2017 నవంబరు 14 నుంచి 2018 డిసెంబర్ 3వ తేదీ వరకు 18 రోజుల పాటు ప్రజా సంకల్ప యాత్ర సాగింది. ఏడు నియోజకవర్గాలు, 14 మండలాలు, 66 గ్రామాల మీదుగా 263 కిలోమీటర్ల మేర వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర చేశారు. ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది జన నేతతో కలసి అడుగులు వేశారు. పాదయాత్ర ద్వారా తెలుసుకున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను, అనుభవాలను మేనిఫెస్టోగా రూపొందించి 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచి అధికారంలోకి వచ్చారు. రెండేళ్లలో 90శాతం, నాలుగున్నరేళ్లలో 99 శాతం హామీలు అమలు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికే అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రజాసంకల్ప యాత్రకు ఆరు వసంతాలు పూర్తయిన సందర్భంగా సోమవారం కర్నూలులో పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కటింగ్ చేయనున్నట్లు జిల్లా కమిటీ పేర్కొంది.

రూ. 2,500 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

- రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతాం
- టీడీపీని ప్రజలు నమ్మరు
- మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



చిన్న మల్కాపురం సభలో మాట్లాడుతున్న మంత్రి బుగ్గన



సమావేశానికి హాజరైన మహిళలు

డోన్: జగనన్న పాలనలో డోన్ నియోజకవర్గంలో రూ. 2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. డోన్ మండలం చిన్న మల్కాపురం పరిధిలో రూ.2 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్న మల్కాపురంలో ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ రాబోయే రెండు మూడు నెలల్లో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తవుతాయన్నారు. డోన్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతామన్నారు. మల్కాపురం పరిధిలోనే రూ. 10 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టడమే కాక రూ.6 కోట్ల విలువైన సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. 266 మందికి ప్రభుత్వం ఇళ్లను నిర్మించిందన్నారు. నియోజక వర్గంలో రూ.40 కోట్లతో 100 పడకల ఆసుపత్రి, రూ.350 కోట్లతో ప్రతి ఇంటికి తాగునీరు అందించే పథకంలో భాగంగా వాటర్ గ్రిడ్ పనులను చేపట్టడం జరిగిందన్నారు. బేతంచెర్ల నుంచి డోన్ వరకు రూ. 750 కోట్లతో జాతీయ రహదారి నిర్మిస్తున్నామన్నారు. రూ. 60 కోట్లతో శ్రీ మద్దిలేటి నరసింహస్వామి, కంబగిరి, గుండాల చెన్నకేశవస్వామి దేవాలయాలను అభివృద్ధి చేశామన్నారు. టీడీపీ నాయకులను ప్రజలు నమ్మరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మళ్లించేలా అబద్ధపు హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు బాటలోనే తెలుగు తమ్ముళ్లు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. సమావేశంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, వ్యవసాయ జిల్లా అధికారి మోహన్ రావ్, ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి, పంచాయితీరాజ్ ఈఈ రామకృష్ణారెడ్డి, డీఈఈ నాగి రెడ్డి, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణ మూర్తి, మాజీ చైర్మన్ రామచంద్రుడు, సర్పంచ్ ప్రసన్న లక్ష్మి, ఉప సర్పంచ్ బుగ్గన రాజేశ్వర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు దొంతిరెడ్డి కృష్ణారెడ్డి, గోపాల్ రెడ్డి, నరేంద్రరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సువర్ణ, రామ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

విద్యా శ్రామికులకు వెన్నుదన్ను

- ప్రైవేటు స్కూళ్ల సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- ఆన్‌లైన్‌లో వేతనాల చెల్లింపు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు
- నిబంధనల మేరకు సెలవులు, ఆరోగ్య బీమా వర్తింపునకు నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులు
- స్వాగతిస్తున్న యాజమాన్యాలు



ప్రైవేటు పాఠశాలలో బోధన చేస్తున్న ఉపాధ్యాయురాలు

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఉద్యోగ భద్రత, ఆర్థిక ప్రయోజనాలు, సదుపాయాలను వర్తింపజేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని అన్-ఎయిడెడ్ (ప్రైవేటు) పాఠశాలల యాజమాన్య ప్రతినిధులతో ఇటీవల విజయవాడలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ నిర్వహించిన సమావేశంలో తీసుకున్న విధాన నిర్ణయాలపై గత నెల అక్టోబర్ 22వ తేదీన విద్యాశాఖ సమగ్ర ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న నిబంధనలు ఇకపై ప్రైవేటు పాఠశాలల్లోనూ తప్పకుండా అమలు చేయాల్సి ఉంది. అకడమిక్ క్యాలెండర్‌ను విధిగా పాటించాలి.

10వేల మందికి ప్రయోజనం..

నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న 800 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 10 వేల మంది బోధన, బోధనేతర సిబ్బంది పని చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలు ఆన్‌లైన్‌లో వేతనాలు చెల్లిస్తుండగా, చిన్నతరహా కాన్వెంట్లు, బడ్జెట్ పాఠశాలలు నగదు రూపంలోనే చెల్లిస్తున్నాయి. ఈ పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలికింది. ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి ప్రతినెలా వేతనాలను బ్యాంకు ఖాతాల ద్వారా ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో అన్ని ప్రైవేటు పాఠశాలలు సిబ్బంది సంఖ్య, వేతన వివరాలపై ప్రభుత్వానికి కచ్చితమైన వివరాలు ఇచ్చే ఆస్కారముంది. దీంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని సర్కారు స్పష్టం చేసింది. ఆరోగ్య బీమా వర్తింపునకూ ఆదేశాలిచ్చింది. ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగం నుంచి తొలగించేందుకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టింది. క్యాజువల్ లీవ్‌లను వర్తింపజేయాలని స్పష్టం చేసింది. విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడిన సిబ్బందికి యాజమాన్యం నష్ట పరిహారాన్ని చెల్లించాలని ఉత్తర్వులిచ్చింది. ఈ నిర్ణయాలను అమలు పర్చే బాధ్యతను ఆర్జేడీ, డీఈఓలకు అప్పగించింది.

గతంలోనే వినతులు...

ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న వారికి పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని బోధన, బోధనేతర సిబ్బంది పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు. దీనిపై సమగ్ర అధ్యయనం చేసిన ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాలపై ప్రైవేటు పాఠశాలల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ (అప్సా), ఏపీ అన్-ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ప్రతినిధులు స్వాగతిస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించారు



ప్రైవేటు పాఠశాలల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను స్వాగతిస్తున్నాం. ఆన్‌లైన్‌లో వేతనాల చెల్లింపు వల్ల అకౌంట్‌బిలిటీ పెరుగుతుంది. ఖర్చుపై సమగ్ర వివరాలు ఉంటాయి. ప్రైవేటు ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించడం హర్షణీయం. – వెంకట నరేష్ ప్రైవేటు స్కూల్ టీచర్, నంద్యాల

ప్రభుత్వ చొరవ అభినందనీయం



ప్రభుత్వ ఉత్తర్వులు కచ్చితంగా అమలయ్యేలా అధికారులు చొరవ చూపాలి. ఇప్పటికే పలు పాఠశాలల్లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ విధానాన్ని అన్ని పాఠశాలలకు వర్తింపజేయాలి. ఆన్‌లైన్‌లో వేతన చెల్లింపులతో పాటు సెలవులను పకడ్బందీగా అమలు చేయాలి. – దండె దస్తగిరి, అప్సా, రాయలసీమ అధ్యక్షుడు, నంద్యాల

క్లుప్తంగా

వైన్‌షాప్ సూపర్‌వైజర్‌పై కేసు నమోదు

బొమ్మలసత్రం: పట్టణంలోని పద్మావతినగర్‌లోని ఎలైట్‌వాక్ ఇన్ స్టోర్స్‌లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్న సూపర్‌వైజర్ దస్సు నాగేశ్వరరావుపై ఎక్సైజ్ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ కృష్ణ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మద్యం బాటిల్‌పై రూ.10 అధికంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు అస్లాంబేగ్, సందీప్‌యాదవ్, కానిస్టేబుల్ కల్పన దాడి చేశారు. నాగేశ్వరరావు అధిక రేటు విక్రయిస్తుండటంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతపై పీడీ యాక్ట్

- కడప జైల్‌కు తరలింపు

ఆత్మకూరు: గంజాయి తదితర మాదకద్రవ్యాల విక్రయానికి పాల్పడుతున్న ఆత్మకూరు పట్టణం పద్మావతి నగర్‌కు చెందిన ఎస్తేరమ్మపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు పీడీయాక్ట్ కేసు నమోదు చేశారు. గత కొన్నేళ్లుగా పట్టణంతో పాటు మండలంలో వివిధ గ్రామాల్లో సారా, గంజాయి విక్రయిస్తుండటంతో ఇప్పటికే ఆరు కేసులు నమోదు చేశారు. అయినా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గంజాయి విక్రేతరాలు ఎస్తేరమ్మపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈ మేరకు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆదేశాల మేరకు నిందితురాలిని ఆదివారం కడప జిల్లా జైలుకు తరలించినట్లు ఆత్మకూరు సీఐ నాగభూషణం తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

ఓర్వకల్లు : మండలంలో నన్నూరు గ్రామంలో క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. స్థానిక బ్రహ్మనిర్వహణ అచల పీఠం దగ్గర కర్ణాటక చంద్రశేఖర్ అనే వ్యక్తితో పాటు తెలంగాణకు చెందిన బిజ కృష్ణమాచారి మరికొందరు కలిసి ఇండియా వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌పై బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. పోలీసులు అక్కడికి వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.1.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

రక్తదాతకు సేవా పురస్కార్



అవార్డు అందుకుంటున్న వెంకటరమణ

ఆదోని సెంట్రల్: రక్తదాత వెంకటరమణ సేవా పురస్కార్‌ను అందుకున్నారు. రెడ్ డ్రాప్ అర్గనైజేషన్ 12వ వార్షికోత్సవం పురస్కరించుకొని గుంతకల్ పట్టణంలో రెడ్ డ్రాప్ సేవా పురస్కార్ అవార్డులను ఆదివారం వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ప్రదానం చేశారు. ఆదోని పట్టణానికి చెందిన వెంకటరమణ 79 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలవడంతో సేవా పురస్కార్ అవార్డును అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్, గుంతకల్ డీఎస్పీ నరసింగప్ప చేతుల మీదుగా అవార్డు అందుకోవడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బంధువులు, మిత్రులు పలువురు వెంకటరమణను అభినందించారు.

నయనం.. నవతేజం

చూపులేకపోతే బతుకంతా చీకటే.. చూపు కొద్దిగా మందగించినా జీవనం కష్టమే. దీనిని గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తన ప్రాధాన్యతాంశాల్లో కంటిచూపు పరిరక్షణకు చోటిచ్చారు. 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమం ద్వారా చిన్నారుల నుంచి పండుటాకుల వరకూ అందరిలో దృష్టి లోపాలు సవరించి అవసరమైనవారికి శస్త్రచికిత్సలు ఉచితంగా చేయిస్తున్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా అమలవుతోంది.



నందికొట్కూరు నియోజకవర్గంలోని జలకనూరు గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



కొరటమద్దిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి (ఫైల్)

- జిల్లాలో పక్కాగా 'కంటి వెలుగు' అమలు
- ఆరు దశల్లో ఇప్పటికే మూడు విడతలు పూర్తి
- 1,91,003 మందికి కంటి పరీక్షలు నిర్వహించిన వైద్యులు
- 41,901 మందికి అద్దాల పంపిణీ.. 6,132 మందికి కంటి ఆపరేషన్లు

గడివేముల: చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఎవరికీ కంటి చూపు దూరం కాకూడదనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. ఇప్పటికే లక్షలాది మందికి కంటిచూపును ప్రసాదించింది. ఆరు దశల్లో అమలు చేసే ఈ కార్యక్రమం ప్రస్తుతం మూడో దశ పూర్తి చేసుకుంది. మొదటి రెండు దశల్లో ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాల చిన్నారులకు నాణ్యమైన కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య చికిత్సలు, కంటి అద్దాలు అందజేశారు. మూడు నుంచి ఆరో దశ వరకు నాలుగు దశల్లో వృద్ధులతో పాటు అవసరమైన వారందరికీ ఉచిత కంటి పరీక్షలు, కంటి అద్దాలు అందజేయడంతో పాటు శస్త్ర చికిత్సలు చేయనున్నారు. జిల్లాలో 1,97,427 మందికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించగా ఇప్పటికే 1,91,003 మందికి నిర్వహించారు. అందులో 42,375 మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉందని ప్రాథమికంగా గుర్తించారు. 1,41,671 మందికి తిరిగి పరీక్షలు నిర్వహించి 42,326 మందికి కంటి అద్దాలను ఉచితంగా అందజేశారు. 6,132 మందికి కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు.

కళ్లద్దాలిచ్చారు



కొన్నాళ్లుగా కండ్లు సరిగా కనడపడట్లేదు. మొన్న మా ఊర్లోనే డాక్టర్లు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసింటే నేను కూడా సూపించుకున్నా. కండ్ల పరీక్ష చేసి మందులు, అద్దాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి జగనే ఇట్లాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయమని చెప్పి డాక్టర్లను పంపినాడంట. ఆయన సల్లంగా ఉండాలి. – వడ్డె వెంకటలక్ష్మమ్మ, గడివేముల

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా



పేదలా ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా ఇస్తోంది. కంటి సమస్యలున్న వారికి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇప్పటికే వైద్య పరీక్షలు నిర్వహించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కంటి అద్దాలు పంపిణీ చేసింది.
– ఎల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, పెసరవాయి

నిరంతరాయంగా 'కంటి వెలుగు'



కంటి వెలుగు కార్యక్రమం జిల్లాలో నిరంతరాయంగా కొనసాగిస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్ల జోళ్లు అందజేశాం. అవసరమైన విద్యార్థులకు ఆపరేషన్లు నిర్వహించాం. మూడో దశలో ఇప్పటికే 97శాతం పైగా వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అందజేశాం. అవసరమైన వారికి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా చేశాం.
– డాక్టర్ మాధవీలత, జిల్లా ప్రోగ్రాం మేనేజర్

కలుపు నివారణపై అవగాహన



కలుపు నివారణపై అవగాహన కల్పిస్తున్న సుజాతమ్మ

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో సమర్థవంతంగా రాణించాలంటే కలుపు నివారణపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సిఫార్సులతోనే కలుపు మందులు వినియోగించాలని, స్వంతంగా నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. పంటల్లో కలుపు సమస్యలు ఉంటే ఎరువులు, పోషకాలు వృథా అవుతాయని వివరించారు. విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త జయచంద్ర వివిధ పంటల్లో కలుపు నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు.

విద్యుత్ శాఖకు రూ.2 లక్షల నష్టం

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ శాఖకు వర్షం షాక్ ఇచ్చింది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి కర్నూలు నగరంలో సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయాయి. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో చీకట్లు కమ్ముకోవడంతో కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆయా ప్రాంతాల్లో అర్ధరాత్రి 1 గంటల వరకు తిరిగి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. దీంతో రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప



మహానందిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప

మహానంది: ఆలయాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప తెలిపారు. మహానందిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడలో శివాలయం పునర్నిర్మాణం పూర్తయిందని, ఈ నెల 19న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. నంద్యాల జిల్లాలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన మద్దిలేటి స్వామి ఆలయంలో రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ జిల్లా గండిలోని ఆంజనేయస్వామి ఆలయంలో రూ. 20 కోట్లు, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో రూ. 6 కోట్లు, అనకాపల్లి లోకాంబిక ఆలయంలో రూ. ఆరు కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. సింహాచలంలో ప్రసాద్ పథకం ద్వారా, శ్రీకాళహస్తిలో వరదరాజుల స్వామి ఆలయం పునర్నిర్మాణం, ఉరుకుందలో రాజగోపురం నిర్మాణాలు జరుగుతున్నట్లు వివరించారు. మహానందిలో దాతల ఆధ్వర్యంలో రాజగోపురం ఎడమ వైపు నిర్మించిన అమ్మవారి విగ్రహాన్ని తీసేయాల్సి ఉంటుందన్నారు. ప్రముఖ ఆలయాల్లో దాతల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణ పనుల విషయంలో కమిషనర్, స్థపతుల సలహాలు తీసుకుంటే దాత సొమ్ము వృథా కాకుండా ఉంటుందని సూచించారు. ఆలయంలో జరుగుతున్న కోనేరుల అభివృద్ధి పనులు, నిశ్చితార్థ మండప నిర్మాణం, గోపురం కలశాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, ప్రధానార్చకులు అర్జునశర్మ, ధర్మకర్త మల్లికార్జున తదితరులు ఉన్నారు.

వాడవాడలా జన సంపర్క అభియాన్



మాట్లాడుతున్న వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పల్లె పల్లెలో వాడవాడలా జన సంపర్క అభియాన్ నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. ఆదివారం వీహెచ్‌పీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీహెచ్‌పీ షష్ఠ్యబ్ది ఉత్సవాల్లో భాగంగా జన సంపర్క అభియాన్ నిర్వహిస్తున్నామన్నారు. హిందువులను జాగృతం చేసేందుకు శౌర్య జాగరణ యాత్రను నిర్వహించామన్నారు. వీహెచ్‌పీను పటిష్ఠం చేయడంతో పాటు సేవలను విస్తృతం చేస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ మాట్లాడుతూ.. అయోధ్యలో జరుగుతున్న భవ్య రామ మందిర నిర్మాణం, జనవరిలో జరిగే మహా ప్రతిష్ఠ కార్యక్రమానికి అశేష హిందూ సమాజాన్ని వివిధ కార్యక్రమాల ద్వారా కలిసేందుకు జన సంపర్క అభియాన్ చేపట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా చివరి యూనిట్ అయిన గ్రామం వరకు వీహెచ్‌పీ చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు టీసీ మద్దిలేటి, వీహెచ్‌పీ క్షేత్ర నిధి ప్రముఖ్ సూర్యప్రకాష్, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, సహ కార్యదర్శులు గోవిందరాజులు, శివప్రసాద్, కోశాధికారి శ్రీనివాసరెడ్డి, బజరంగ్ దల్ కన్వీనర్ రాజేష్, నాయకులు శివశంకర్, మహేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం బలోపేతానికి చర్యలు

- రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వాడాల నాగరాజు



ఐక్యతను చాటుతున్న రజక నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో రజక సంఘాల ఐక్య వేదికను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వాడాల నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక బీసీ భవన్‌లో వేదిక నగర అధ్యక్షులుగా బాపనపల్లి సూర్యనారాయణను నియమించారు. ఈ సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రజకుల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నగర నూతన అధ్యక్షుడిగా నియమితులైన సూర్యనారాయణ మాట్లాడుతూ నగరంలోని రజకులను విద్య, వైద్య, సామాజిక, ఆర్థిక రంగాల్లో ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రజక సంఘాల నాయకులు న్యాయవాది చీమల చంద్రశేఖర్, వేంపెంట రాంబాబు, కేతూరు మధు, సీపీ వెంకటేష్, గోల్డ్‌మెన్ శ్రీను, రఘు, మధుబాబు, భరత్, కొత్తపేట మధు, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, నాగరాజు, లక్ష్మికాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు



ఆలయ ఆవరణలో డీఐజీ రాజశేఖర్‌బాబు దంపతులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ దేవదాయశాఖ స్థపతి పరమేశ్వరప్ప శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అలాగే ఏపీ లా అండ్ ఆర్డర్ డీఐజీ రాజశేఖరబాబు, తెలంగాణ హైకోర్టు జాయింట్ రిజిస్ట్రార్ మల్లికార్జున వర్మ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ రత్నకుమారి, నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, నంద్యాల జిల్లా ఎస్‌బీ డీఎస్పీ సంతోష్, వేర్వేరుగా మహానంది ఆలయానికి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ముడియం చంద్రశేఖర్‌రెడ్డి, బత్తుల నాగభూషణం తదితరులు స్వాగతం పలికారు. వారి వెంట సీఐ రవీంద్ర, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, పాల్గొన్నారు. వారందరికీ స్థానిక ఆశీర్వచన మండపంలో స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు.

చెంచుగూడేనికి రాచ'బాట'



సిమెంట్ రోడ్డు నిర్మించిన దృశ్యం

కొలిమిగుండ్ల: దశాబ్దాలుగా చెంచులు జనజీవనానికి దూరంగా ఉంటున్నా గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. 'ఎన్ని కుటుంబాలున్నాయి? ఎన్ని ఓట్లున్నాయి? మనకే వేస్తారా? లేదా?' అంటూ లెక్కలేసుకున్న రాజకీయనాయకుల వల్ల ఈ చెంచు గూడెం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయింది. ఇవేమీ చూడకుండా వీరిని జగనన్న ప్రభుత్వం గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంది. మండల పరిధిలోని బి.తాడిపత్రికి 2 కి.మీ దూరంలో కొండపై 80 ఏళ్ల నుంచి 30 చెంచు కుటుంబాలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చెంచుగూడేం అభివృద్ధిపై దృష్టి పెట్టారు. బి.ఉప్పలూరు నుంచి విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి గూడేనికి విద్యుత్ సరఫరా కల్పించారు. బోరు వేసి తాగునీటి సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం రూ.42 లక్షలతో రోడ్డు ఏర్పాటు చేసి చెంచులకు రాచబాట ఏర్పాటు చేశారు. తమ గూడేనికి రోడ్డు వస్తుందని ఊహించుకోలేదని చెంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బి.తాడిపత్రి నుంచి 340 మీటర్ల సీసీ రోడ్డు, అక్కడి నుంచి గూడెం వరకు గ్రావెల్ రోడ్డు నిర్మించారు. మధ్యలో రెండు చోట్ల వాగు నీళ్ల కోసం కల్వర్టులు నిర్మించారు. ఈరోడ్డు ఏర్పాటు చేయడంతో చెంచులతో పాటు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనుండటంతో హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు



క్రీడాకారిణులతో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శులు

నందవరం: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్ మైదానంలో రెండవ రోజు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో 16 జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. పోటీలను కర్నూలు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మన్న, కృష్ణ జిల్లా కార్యదర్శి అజయ్ ప్రారంభించారు. 13 జిల్లాల నుంచి క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం అండర్-17 బాలికల విభాగంలో చిత్తూరు, విజయనగరం మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు జట్టు 2-0 గోల్స్‌తో విజయం సాధించింది. అలాగే విశాఖపట్టణం, ఈస్ట్ గోదావరి జట్ల మధ్య పోటీల్లో విశాఖ జట్టు 2-0 గోల్స్‌తో గెలుపు సాధించింది. మొత్తం 16 జట్లు పోటీలో పాల్గొన్నగా 8 జట్లు కడప, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కృష్ణ, అనంతపురం, వెస్ట్ గోదావరి జట్లు విజయం సాధించాయి. టోర్నమెంట్ అబ్జర్వర్లు పీడీ మహమ్మద్ హనీఫ్, ప్రభాకర్, ఉమాపతి, లతీఫ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ అండర్-17 బాలుర పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు జరిగిన పోటీల్లో కృష్ణా జిల్లాపై కర్నూలు జిల్లా జట్టు విజయం సాధించగా, ప్రకాశం జిల్లాపై విజయనగరం జట్టు విజయం సాధించింది. విశాఖ పట్టణం, ఈస్ట్‌గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రా అయింది. అలాగే వైఎస్ఆర్ జిల్లా, శ్రీకాకుళం జట్ల మధ్య మ్యాచ్ కూడా డ్రా అయ్యింది. ప్రకాశం జట్టుపై చిత్తూరు విజయం సాధించగా అనంతపురం జట్టుపై విజయనగరం జట్టు గెలుపొందింది. వెస్ట్‌గోదావరిపై కర్నూలు జిల్లా విజయం సాధించింది. గుంటూరు జట్టుపై విశాఖ పట్టణం జట్టు గెలుపొందగా ఎస్‌పీఆర్ నెల్లూరు జట్టుపై వైఎస్సార్ జట్టు విజయం సాధించింది. దీంతో లీగ్ పోటీలు ముగియగా క్వార్టర్ ఫైనల్‌కు శ్రీకాకుళం, వెస్ట్‌గోదావరి, విజయనగరం, ఈస్ట్‌గోదావరి, విశాఖ పట్టణం, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ జట్లు చేరుకున్నాయి.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ఎదగాలి

ఆదోనిఅర్బన్: ఆర్యవైశ్యులు రాజకీయంగా, ఆర్థికంగా, వ్యాపారంగా అన్ని రంగాల్లో ఎదగాలని మాజీ రాజ్యసభ సభ్యుడు, ఏపీ మహాసభ చైర్మన్ టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆదోని పట్టణశివారులోని వాసవీ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీ వెంకటేష్, రాష్ట్ర నాయకులు జయంతి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, విట్టా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. ఆదోని పట్టణంలోని వాసవీమాత ఆలయ అభివృద్ధికి రూ.కోటి, ఆర్యవైశ్యుల హాస్టల్ అభివృద్ధికి రూ.4 కోట్లు అందజేస్తానన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మిర్యాల బద్రినాథ్, ప్రధాన కార్యదర్శిగా ఫణిభూషణ్, జిల్లా కోశాధికారిగా బల్లిటీగి వినోద్‌కుమార్‌లతో ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. అంతేగాకుండా 12 మంది ఉపాధ్యక్షులు, 10 మంది కార్యదర్శులు, 13 మంది సహాయ కార్యదర్శులు, 8 మంది సహాయ కోశాధికారులు, 20 మంది కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. కార్యక్రమంలో ఆదోని పట్టణ, మంత్రాలయం, కోడుమూరు, ఎమ్మిగనూరు, కోసిగి, కర్నూలు, పత్తికొండ, ఆలూరు మండలాలకు సంబంధించిన ఆర్యవైశ్యులు, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

శ్రీశైలంలో భక్తుల రద్దీ



భక్తులతో కిటకిటలాడుతున్న క్యూలు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో శ్రీశైలం చేరుకోవడంతో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామిఅమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయ క్యూల వద్ద బారులు తీరారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు భక్తులతో నిండిపోయాయి. ఆలయ క్యూలలో దర్శనాల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థానం అధికారులు పలు చర్యలు చేపట్టారు. క్యూలలో వేచి ఉండు భక్తులకు అల్పాహారం , త్రాగునీరు, బిస్కెట్లు, అందించారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్నీ కళకళలాడాయి. స్వామిఅమ్మవార్ల దర్శన అనంతరం భక్తులు అన్నపూర్ణభవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.